క్లుప్తంగా

ఆహ్వాన పత్రిక అందజేత



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మార్చి 2 నుంచి కొనసాగే స్వామివారి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి ఆలయ ఈఓ బిల్ల శ్రీనివాస్, చైర్మన్ కరుణాకర్‌రెడ్డి అందించారు. అలాగే జిల్లా అధికారులు ఎస్పీ, ఏఎస్పీ, డీఎస్పీ, సింగరేణి మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, ఆర్టీసీ డీఎంలకు ఆహ్వాన పత్రికలను అందించారు. వారి వెంట ఆలయ కమిటీ సభ్యులు పోగు సుమన్ ఉన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

మొగుళ్లపల్లి: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి శ్రీరామ్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డ్స్, హాజరు పట్టిక, ల్యాబ్ రూం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రి సిబ్బంది సమయపాలన పాటించాలని, లేనిచో చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నవత, ఫార్మసిస్ట్ రమేష్, టెక్నిషియన్ సంపూర్ణ, స్టాఫ్ నర్స్ సరిత, భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీపీ మండల అధ్యక్షుల నియామకం



శేఖర్, మహదేవపూర్



సుదర్శన్, కాటారం

కాటారం: వైఎస్సార్ తెలంగాణ పార్టీ మహదేవపూర్, మహాముత్తారం మండలాల అధ్యక్షులను పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాలతో సోమవారం నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్ తెలిపారు. మహదేవపూర్ మండల అధ్యక్షుడిగా చేకుర్తి శేఖర్, మహాముత్తారం మండల అధ్యక్షుడిగా జాడి సుదర్శన్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి షర్మిలతోనే సాధ్యమని భావించి జిల్లాలో పలు పార్టీలకు చెందిన వారు వైఎస్సార్‌టీపీలో చేరుతున్నారని ఇంకా చేరడానికి అనేక మంది సిద్ధంగా కిషన్ తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం జిల్లాలో రాజకీయ నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలు చేసుకుంటున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో ప్రజలు షర్మిల, వైఎస్సార్‌టీపీ పాలన కోరుకుంటున్నారని అన్నారు.

దరఖాస్తు



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి వచ్చే నిధులు, ఖర్చులపై సోమవారం పంచాయతీ కార్యదర్శి స్వప్నకు ఆర్టీఐలో గ్రామస్తులు దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఎలాంటి అభివృద్ధి చెందలేదని, గ్రామానికి నిధులను ప్రభుత్వం విడుదల చేయడం లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. అన్ని గ్రామ పంచాయతీలో వలే నిధులు వస్తే గ్రామంలో అభివృద్ధి పనులను ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. నిధుల వినియోగంపై దరఖాస్తు చేసినట్లు తెలిపారు. రాకేష్, తిరుపతి, రవితేజ, రాకేష్, రాజ్‌కుమార్, పోశెట్టి ఉన్నారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి



సేవనాయక్(ఫైల్)

మల్హర్: అప్పుల బాధతో పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న రైతు మృతి చెందిన సంఘటన మండలంలో మల్లెంపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఏఎస్సై కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మల్లెంపల్లికి చెందిన సేవనాయక్(47) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో 4 ఎకరాలల్లో పత్తి, మిర్చి సాగు చేశాడు. అలాగే ఇటీవల కూతురు వివాహం కూడా చేశాడు. దీంతో రూ.7లక్షల వరకు అప్పులు అయ్యాయి. దీనికి తోడు సాగు చేసిన పంటల్లో దిగుబడి సక్రమంగా రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్థాపానికి లోనై ఈనెల 26 (ఆదివారం)న ఉదయం పొలంలో పురుగుల మందు తాగాడు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందనట్లు ఆయన తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెల్లడించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



కాటారం: నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

కాటారం: ప్రీతి మృతికి కారణమైన నిందితుడిని ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ప్రధాన కూడలిలో జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రీతికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీరా శ్రీకాంత్‌నాయక్, ఎస్సీఎస్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు కడారి విక్రమ్ మాట్లాడుతూ సీనియర్ విద్యార్థి సైఫ్ ర్యాగింగ్‌తోనే ప్రీతి ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపించారు. ఈ ఘటనపై పూర్తి విచారణ చేపట్టాలని ప్రీతి మృతికి కారణమైన ప్రతి ఒక్కరిని శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుమారు గంటకు పైగా విద్యార్థి సంఘాల నాయకులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించడంతో వాహనాలు నిలిచిపోయాయి. సీఐ రంజిత్‌రావు సంఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ఈ ఆందోళనలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా ఇన్‌చార్జ్ రుబిన్‌నాయక్, హట్కర్ దేవసింగ్, ప్రశాంత్, గోపి, అలోత్ ఎలీషా, చందు, తరుణ్, అజయ్, సిద్ధార్థ్, రవితేజ, వంశీ, ప్రేమ్, కుమార్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారం: వరంగల్ కేఎంసీ మెడికల్ కాలేజీ విద్యార్థి డాక్టర్ ప్రీతీనాయక్ మృతికి కారకులైన వారిని ఉరితీయాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు రూబీన్‌నాయక్ అన్నారు. అందుకు నిరసనగా సోమవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులను క్లాస్‌లకు హాజరుకాకుండా అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి గిరిజన సంఘం జిల్లా నాయకుడు రూబీన్, దేవ్‌సింగ్, ప్రశాంత్, ఎలీషా తదితరులు ఉన్నారు.



మహాముత్తారం: పాఠశాలను బంద్ చేయిస్తున్న నాయకులు

ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయొద్దు



భూపాలపల్లి: కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎస్పీ సురేందర్‌రెడ్డి

భూపాలపల్లి: పోలీసు అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయవద్దని, కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎస్పీ జె.సురేందర్‌రెడ్డి సూచించారు. జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎస్పీ కంటి పరీక్షలు చేయించుకున్నారు. మూడు రోజుల పాటు శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వి.శ్రీనివాసులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బాధితులతో మర్యాదగా వ్యవహరించాలి..

వివిధ సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలని ఎస్పీ జె.సురేందర్ రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివస్ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 14మంది నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. బాధితుల సమస్యలను తెలుసుకొని వెంటనే స్పందించి, విచారణ చేపట్టి, పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహదేవపూర్: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. మహదేవపూర్ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ సోమవారం సందర్శించారు. ప్రజలకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు చేయించుకోవాలని, అర్హులైన వారికి వెంటనే కంటి అద్దాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శ్రీకాంత్, మెడికల్ ఆఫీసర్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి: జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే పూర్తి పారదర్శకంగా డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయిస్తున్నామని, దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దని కలెక్టర్ భవేష్ మిశ్రా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపు సాకుగా చూపిస్తూ అమాయక ప్రజల నుంచి కొంత మంది దళారులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దళారులకు ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. పూర్తి ఉచితంగా అర్హులను నిబంధనల మేరకు పారదర్శకంగా ఎంపికచేసి డబుల్ బెడ్ రూం ఇళ్లు అందిస్తున్నట్లు చెప్పారు. ఇళ్ల మంజూరు కోసం ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. ఎవరైనా డబ్బులు అడిగినా, మోసగించాలని చూసినా వెంటనే కలెక్టర్ కార్యాలయంలో సమాచారం అందించాలని సూచించారు.

25 దరఖాస్తులు..

జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్‌హౌస్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 25 దరఖాస్తులు వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులపై నిర్లక్ష్యం ప్రదర్శించకుండా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. డీపీఓ ఆశాలత, సీపీఓ శామ్యూల్, డీఆర్‌డీఓ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

- బస్తీబాటలో ఎమ్మెల్యే గండ్ర



వేశాలపల్లి గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం భూపాలపల్లి పట్టణంలోని 11వ వార్డు వేశాలపల్లి గ్రామంలో బస్తీబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో డ్రెయినేజీల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారు. వేశాలపల్లి నుంచి పుల్లూరు రామయ్యపల్లి గ్రామం వెళ్లేందుకు చెరువు కట్టపై గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి కావాల్సిన నిధులను వెంటనే మంజూరు చేస్తామని హామీఇచ్చారు. అనంతరం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, వార్డు కౌన్సిలర్ బానోత్ రజిత జుమ్ములాల్, వార్డు అధ్యక్షుడు దుంద్ర కుమార్, పార్టీ నాయకులు అజయ్ పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌ను పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పంతకాని సమ్మయ్య

కాటారం: గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ భారత్ మిషన్‌ను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో స్వచ్ఛ భారత్ మిషన్ రెండవ దశ అమలుపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ భారత్ మిషన్ శిక్షణలో భాగంగా నేర్పిన అంశాలు, మెలుకువలు, సలహాలు పాటించి గ్రామపంచాయతీల్లో అమలు చేయాలని తెలిపారు. మొదటి రోజు శిక్షణలో భాగంగా స్వచ్ఛ భారత్ మిషన్ రెండో దశలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్ పవర్ పాయింట్ ప్రజెంట్ ద్వారా వివరించారు. ఓడీఎఫ్ సుస్థిరత, తడి, పొడి చెత్త నిర్వహణ, వ్యర్థపునీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు, మానవ మలాలు నిర్వహణ, స్వచ్ఛ మెలుకువల గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఎం కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, ఎంపీఓ ఉపేంద్రయ్య సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వీఓ అధ్యక్షులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భజనలు మాని అభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న కోటగిరి సతీష్‌గౌడ్

టేకుమట్ల: బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భజనలు మాని అభివృద్ధికి పాటుపడాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధిని మరిచి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వర్గాలైన బీఆర్‌ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణ, ప్రత్యారోపణలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. రేవంత్‌రెడ్డి నిర్వహించిన జోడో యాత్రకు వచ్చిన ప్రజాధారణను చూసి ఓర్వలేని మండల నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఒకే పార్టీలోని రెండు వర్గాలు ఆరోపణలు చేసుకోవడంలో అర్థం లేదని అన్నారు. అభివృద్ధిని పక్కన బెట్టి మీరు చేస్తున్న వెలికి చేష్టలతో ప్రజలు విసుగు చెందుతున్నారన్నారు. చిల్లర రాజకీయాలు మాని చిత్తశుద్ధితో అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, అల్లం ఓదెలు, తదితరులు ఉన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన



ధర్నా చేస్తున్న కార్మికులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో ఖాళీగా ఉన్న సింగరేణి క్వార్టర్లను కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని సీఐటీయూ బ్రాంచీ కార్యదర్శి కంపేటి రాజయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో ఏరియా ఎస్‌ఓటూ జీఎం కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టి జీఎంకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా వివిధ ఏరియాల్లో 20వేల క్వార్టర్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పర్మనెంట్ కార్మికులతో సమానంగా పని చేస్తూ కాంట్రాక్టు కార్మికులు బొగ్గు ఉత్పత్తిని చేస్తూ సంస్థకు వస్తున్న లాభాల్లో తోడ్పడుతున్నారని తెలిపారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, కార్మికుల క్వార్టర్లను యాజమాన్యం అధికార పార్టీ నాయకులకు కట్టబెడుతుందని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులకు కేవలం వేతనాలు మాత్రమే అమలు చేస్తున్నారని.. ఎటువంటి బెనిఫిట్లు వర్తింప చేయడం లేదన్నారు. సింగరేణి ఆస్పత్రిలో వైద్య సేవలు అందించి, సింగరేణి పాఠశాల విద్య సౌకర్యం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికులను ఏకంచేసి ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, లక్ష్మి, స్వామి, సంపత్, మొగిలి, శ్రీనివాస్, మహేందర్, శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలకు ఉచితంగా పట్టాలివ్వాలి



వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నాయకులు

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 58ను అమలు చేసి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటి స్థలాలకు ఉచితంగా పట్టాలివ్వాలని వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్ భవేష్ మిశ్రాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కంపేటి రాజయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో 58, 59 జీఓ ప్రకారం దరఖాస్తులు తీసుకొని వాటిని పెండింగ్‌లో పెట్టారన్నారు. 59 జీఓను అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమన్నారు. కానీ 58జీఓ ప్రకారం జిల్లా కేంద్రంలో స్థిర నివాసం ఏర్పరుచుకున్న పేదలందరికీ ఉచితంగా పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పాత ఎర్ర చెరువులో గుడిసెలు వేసుకున్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని, పేదలపై పెట్టిన కేసులు ఎత్తేయాలన్నారు. ప్రజా సంఘాల నాయకులు పొలం రాజేందర్, చింతల రజినీ కాంత్, రాధారపు మల్లయ్య, పూలంరాజేందర్ పాల్గొన్నారు.

జోడోయాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేడు (మంగళవారం) చేపట్టనున్న హాథ్‌సే హాథ్ జోడో యాత్రకు జిల్లా నలుమూలలనుంచి పార్టీ కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం ఏడు గంటలకు కేటీకే 5వ గని వద్ద సింగరేణి కార్మికులతో ఏర్పాటుచేసిన గేట్‌మీటింగ్‌లో పాల్గొంటారన్నారు. అనంతరం జిల్లాకేంద్రంలో మహిళలతో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు కాసీంపల్లి గ్రామం నుంచి యాత్ర ప్రారంభమై సెగ్గంపల్లి, జంగేడు, రాంనగర్, ఎల్‌బీనగర్, లక్ష్మీనగర్, రాజీవ్‌గాంధీ విగ్రహం మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు కొనసాగుతుందన్నారు. అంబేడ్కర్ సెంటర్‌లో జరిగే పబ్లిక్ కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడుతారని చెప్పారు.

ఫ్లెక్సీలను తొలగించాలి..

కేటీఆర్ సభకు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను, కటౌట్‌లను తీయించాలని గండ్ర సత్యనారాయణరావు అన్నారు. తమ నాయకుడు ప్రసంగించే అంబేడ్కర్ సెంటర్‌లో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ కటౌట్‌లను తొలగించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు చల్లూరి మధు, అర్బన్ అధ్యక్షుడు దేవన్, కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, ఐఎన్‌టీయూసీ నాయకుడు పసునూటి రాజేందర్, నాయకులు అంబాల శ్రీనివాస్, రవీందర్, మహేందర్, రజనీకాంత్, బీర్తి పృథ్వీ, కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘిస్తే వేటు



మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి

టేకుమట్ల: బీఆర్‌ఎస్ నాయకులు పార్టీ క్రమ శిక్షణను ఉల్లంఘిస్తే వేటు తప్పదని ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీలో వర్గాలను సృష్టిస్తూ రెండు రోజులుగా చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నియోజకవర్గం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి పథంలో నడుస్తుందని, నాయకులపై పదేపదే ఆరోపణలు చేస్తూ కావాలని పార్టీలో వర్గాలను ప్రేరేపిస్తే పార్టీ క్రమ శిక్షణలో భాగంగా వేటు తప్పదని హెచ్చరించారు. పార్టీ పరంగా ఏదైనా సమస్య తలెత్తితే పార్టీ మండల అధ్యక్షుల దృష్టికి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించుకోవాలే కానీ వర్గ విభేదాలు సృష్టిస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, వివిధ గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు అడగాని రామారావు, చింతలపెల్లి స్వామిరావు, నల్లబెల్లి రవీందర్, నందికొండ మహిపాల్‌రెడ్డి, సంగి రవి, సంపత్‌రావు, గందం సారయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, చదువు మధుర, బండెల నరేష్, గువ్వాడి లక్ష్మణ్, రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సుష్మిత

కాళేశ్వరం: మండల పరిధిలోని పల్గుల గ్రామంలో సోమవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్యాధికారి సుస్మిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మానెం సమ్మయ్య, ఉప సర్పంచ్ వెంకటేష్, హెల్త్ సూపర్వైజర్ సమ్ము రమణయ్య, ఆశ వర్కర్ శ్రీలత తదితరులు ఉన్నారు.

నాసిరకంగా డ్రెయినేజీ నిర్మాణ పనులు

మల్హర్: మండలంలోని ఆడ్వాలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను కాంట్రాక్టర్ నాసిరకంగా చేపడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈజీఎస్ నిధుల ద్వారా రూ.3లక్షల నిధులతో నిర్మిస్తున్న పనుల్లో నాణ్యత లేని ఇసుక వాడుతున్నాడని, కొలతల్లో సైతం వ్యత్యాసాలు ఉన్నట్లు వాపోతున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువడంతో పనులు నాసిరంగా జరుగతున్నాయని ఆరోపిస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరితను వివరణ కోరగా పనులు నాణ్యతంగానే కొనసాగతున్నాయని, అక్కడక్కడ వ్యత్యాసం ఉన్న చోటు రీకన్‌స్ట్రక్షన్ చేపిస్తున్నామని స్పష్టంచేశారు.

యూరియా అమ్మకాల నిలిపివేత



స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న ఏఓ రామకృష్ణ

కాటారం: మండలంలోని నాలుగు ఎరువుల దుకాణాల్లో యూరియా స్టాక్ నిల్వలకు సంబంధించి రికార్డులు సరిగా లేకపోవడంతో యూరియా అమ్మకాలు నిలిపివేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి గిరి రామకృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని గారెపల్లి, దేవరాంపల్లిలోని ఎరువుల దుకాణాలల్లో సోమవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడం, ఇన్‌వాయిస్ సమర్పించకపోవడంతో నాలుగు దుకాణాలల్లో యూరియా అమ్మకం చేపట్టరాదని నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. గారెపల్లిలోని బచ్చు ప్రభాకర్ ఫర్టిలైజర్స్‌లో 363 యూరియా బస్తాలు, క్రాంతి కుమార్ ట్రేడర్స్‌కు చెందిన 784, లావణ్య ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్‌కు చెందిన 392, దేవరాంపల్లిలోని శ్రీ రాజరాజేశ్వర ఫర్టిలైజర్స్‌కు చెందిన 586 యూరియా బస్తాలు విక్రయించకుండా నిలిపివేసినట్లు వివరించారు.

నట్టల నివారణ మందు పంపిణీ



నట్టల నివారణ మందు వేస్తున్న సిబ్బంది

కాళేశ్వరం: మండల పరిధిలోని మెట్‌పల్లి గ్రామంలో సోమవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. పశు వైద్యాధికారి మల్లేష్ ఆధ్వర్యంలో సిబ్బంది 3865 గొర్రెలకు 745 మేకలకు నట్టల నివారణ మందులను వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముక్కల శోభ, పశువైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.